క్లుప్తంగా

ఎమ్మెల్యే దొంతికి కలెక్టర్ పరామర్శ

నర్సంపేట : స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డిని అతడి తల్లి కాంతమ్మ ఇటీవల మృతి చెందిన క్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారద శనివారం పరామర్శించారు. తొలుత కాంతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

'కపాస్'పై సదస్సు



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతులకు సీసీఐ కొనుగోళ్లకు సంబంధించిన కపాస్ కిసాన్ యాప్‌పై శనివారం అవగాహన కల్పించారు. తొలుత పీఎం కిసాన్ ధన్-ధాన్య కృషి యోజనపై ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రదర్శించారు. రైతులకు అవగాహన కల్పించారు. యాప్ వినియోగించే విధానాన్ని వివరించారు.

శివాలయంలో మాజీ డీజీపీ పూజలు



పర్వతగిరి : మండలంలోని పర్వతాల శివాలయంలో మాజీ డీజీపీ జేవీ.రాముడు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలానికి వచ్చిన సందర్భంగా తొలుత ఆయన కల్లెడలోని స్నేహితుడు రామ్మోహన్ నివాసంలో బస చేశారు. అనంతరం ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. స్థానిక ఎస్సై బోగం ప్రవీణ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

వైద్యవిద్యార్థినికి సాయం



గీసుకొండ : మండలంలోని దస్రుతండాకు చెందిన కేలోతు స్రవంతికి వైద్య విద్యాభ్యాసానికి జిల్లా కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి శనివారం రూ.50 వేలు సాయంగా అందజేశారు. తొలుత స్రవంతిని బాలకిశోర్‌రెడ్డి అభినందించారు. ఎంబీబీఎస్ ఎంట్రెన్స్‌లో ప్రతిభ చాటి ఆదిలాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో సీటు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యాభ్యాసానికి పేదరికం అడ్డంకి కాకూడని ఆకాంక్షించారు. సహాయం అందించడానికి తాను ముందుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు వీరగోని రాజ్‌కుమార్, రడం భరత్, కేలోతు స్వామి, బాదావత్ చంద్రభాను, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

నియామకం



నర్సంపేట : హ్యూమన్ రైట్స్ నర్సంపేట నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడిగా బర్ల దేవదాస్, చెన్నారావుపేట మండల ముఖ్య సలహాదారుగా పర్కాల కొమురయ్య నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాస్‌కు, కొమురమ్మకు డివిజన్ ఇన్‌చార్జ్ నర్మెట యాదగిరి, డివిజన్ కన్వీనర్ సాదు నర్సింగరావు శనివారం నియామక పత్రాలు అందించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆకులపెల్లి ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి పాముకాటు

గంగారం : బహిర్భూమికి వెళ్లిన ఒకరికి పాము కాటు వేసిన ఘటన మండలంలోని మడగూడెంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సుంచ భద్రయ్య రాత్రి బహిర్భూమికి వెళ్లాడు. ఈ క్రమంలో పాము కాటు వేసింది. వెంటనే స్థానికులు గమనించి 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బాలికల విద్యకు తోడ్పాటు అందించాలి

ఖిలా వరంగల్ : బాలికల విద్యకు తోడ్పాటు అందించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మండల పరశురాములు అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శనివారం శివనగర్‌లోని డాన్ బాస్కో నవజీవన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఫాదర్ కోషి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలోని అదరణ నిరాదరణకు గురైన బాలికలను చేరదీసి విద్యాబుద్ధులు నేర్పించడంలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో బాలల పరిరక్షణ ఇన్‌చార్జ్ ప్రవీణ్ కుమార్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానకు డాక్టర్ కరువు

● ప్రజారోగ్యాన్ని గాలికొదిలి డిప్యుటేషన్..!



నర్సంపేట రూరల్ : మండలంలోని లక్నేపల్లి పల్లె దవాఖానాకు వైద్యుడు కరువయ్యాడు. ఉన్నతాధికారులు ప్రజారోగ్యాన్ని గాలికొదిలి ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న వైద్యుడిని డిప్యూటేషన్‌పై పంపించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నెల రోజులుగా వైద్యుడు లేక రోగులు ప్రైవేట్ ఆస్పత్రుల పాలై నానా అగచాట్లు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని లక్నేపల్లి పల్లె దవాఖానా పరిధిలో లక్నేపల్లి, మగ్రినర్సయ్యపల్లి, రామవరం, రంగంపల్లి గ్రామాలున్నాయి. లక్నేపల్లిలో 640 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2140 మంది జనాభా ఉండగా అందులో 1061 మంది పురుషులు, 1079 మంది స్త్రీలున్నారు. అలాగే రామవరం గ్రామ పంచాయతీ పరిధిలో 220 కుటుంబాలు, 1160 మంది జనాభా.. అందులో 575 మంది పురుషులు, 595 మంది స్త్రీలు ఉన్నారు. ఈ రెండు గ్రామాల ప్రజలు రోగాల బారిన పడితే వైద్యం కోసం బానోజీపేటలోని పీహెచ్‌సీకి వెళ్లాల్సి వచ్చేది. ఈ క్రమంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బీఆర్ఎస్ హయాంలోనే లక్నేపల్లికి పల్లె దవాఖానా మంజూరు చేశారు. అలాగే రూ.13 లక్షల మేరకు నిధులు విడుదల చేశారు. దీంతో లక్నేపల్లి-మగ్రినర్సయ్యపల్లి ప్రధాన రహదారి పక్కనే పల్లె దవాఖానా నిర్మించారు. వైద్యుడిని, సిబ్బందిని నియమించారు. నాటి నుంచి రెండు గ్రామాల నుంచి ప్రతిరోజూ సుమారు 25–30 మంది రోగులు పల్లె దవాఖానాకు వచ్చి ఔట్ పేషెంట్లుగా వైద్యసేవలు పొందుతున్నారు. ఈ క్రమంలో సుమారు నెల రోజులుగా క్రితం వైద్య శాఖ ఉన్నతాధికారులు పల్లె దవాఖానా వైద్యుడిని డిప్యూటేషన్‌పై మేడపల్లి పీహెచ్‌సీకి డిప్యూటేషన్‌పై పంపించారు. దీంతో నాటి నుంచి వైద్యుడు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యం కోసం ఆర్ఎంపీలను ఆశ్రయిస్తూ, ఆరోగ్యం కుదుట పడకుంటే ప్రైవేట్ ఆస్పత్రుల పాలై ఆర్థికంగా నష్టపోతున్నారు.

వైద్యపరీక్షలు బంద్.. నర్సులే దిక్కు..

లక్నేపల్లి పల్లె దవాఖానా వైద్యుడు డిప్యూటేషన్‌పై వెళ్లినప్పటి నుంచి వైద్యపరీక్షలు నిలిచిపోయాయి. రోగులకు నర్సులే వ్యాక్సినేషన్ చేస్తున్న, మందులు ఇస్తున్న దుస్థితి నెలకొంది. వర్షాకాలంలో ప్రజలు జ్వరాల బారిన పడే అవకాశాలు మెండుగా ఉన్నా వైద్యుడిని డిప్యూటేషన్‌పై పంపించారని ప్రజలు మండిపడుతున్నారు. మరో వైద్యుడిని నియమించకుండానే ఉన్న వైద్యుడిని పంపించేశారన్న అపవాదు ఉంది. ఇకనైనా ప్రభుత్వం, వైద్య శాఖ ఉన్నతాధికారులు స్పందించి లక్నేపల్లి పల్లె దవాఖానా వైద్యుడి డిప్యూటేషన్ రద్దు చేయాలని, లేదా మరో వైద్యుడిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

వైద్యుడు లేక ఇబ్బంది



వైద్యుడు లేక ఇబ్బంది పడుతున్నాం. నాలుగు రోజుల క్రితం కాలుకు దెబ్బ తగలడంతో పల్లె దవాఖానాకు వెళ్లా. వైద్యుడు లేకపోవడంతో నర్సు గోలీలు ఇచ్చి పంపించింది. గోళీలు నర్సు సూచన మేరకు వేసుకున్నా నయం కాకపోవడంతో ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సంపేటలోని ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చింది. ప్రతిరోజూ పదుల సంఖ్యలో రోగుల ఆస్పత్రికి వచ్చి వైద్యుడు లేకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించాలి. వైద్యుడిని కేటాయించాలి.

- కునూరు కుమార్, లక్నేపల్లి గ్రామస్తుడు

అవగాహనతోనే 'సహ' సద్వినియోగం

● ప్రముఖ న్యాయవాది యాకాంబ్రం



మాట్లాడుతున్న న్యాయవాది యాకాంబ్రం

పర్వతగిరి: సమాజంలోని ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉంటేనే సమాచార హక్కు-2025 (సహ) చట్టాన్ని సద్వినియోగం చేసుకోగలమని ప్రముఖ న్యాయవాది పొడకంట యాకాంబ్రం తెలిపారు. ఆ చట్టం వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ పాఠశాల/కళాశాలలో శనివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలు అవసరమైన పలు రకాల సమాచారాన్ని అధికారికంగా పొందవచ్చని తెలిపారు. విద్యార్థి దశలోనే చట్టంపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో ఉపయోగించుకోవచ్చని చెప్పారు. విద్యార్థులు చదువులతోపాటు ఆటపాటల్లోనూ రాణించాలని, సామాజిక అంశాలపైనా చైతన్యవంతం కావాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జ్యోత్స్న, సామాజిక కార్యకర్త దిలీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ అమలుపై చిత్తశుద్ధి లేదు



అంబేడ్కర్ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

● బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటనారాయణ

నర్సంపేట : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి కరువైందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ గౌడ్ అన్నారు. ఆ పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడారు. కామారెడ్డిలో జరిగిన సభలో ప్రకటించిన మేరకు బీసీ రిజర్వేషన్ అమలు చేయకుంటే సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు తక్షణమే రాజీనామా చేయాలన్నారు. రాజ్యాంగబద్ధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీదే ఉందన్నారు. అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీలు తీర్మానం చేసిన బిల్లులు, ఆర్డినెన్సులు గవర్నర్, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండగా కాంగ్రెస్ పార్టీ కుట్రపూరితంగా జీఓ నంబర్ 9 తీసుకొచ్చిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలని చేసిన కుట్రలు పటా పంచలయ్యాయని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధన దిశగా అఖిల పక్షాలను ఏకం చేసి ఢిల్లీలో ఉద్యమించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్ల మనోహర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు మచ్చిక నర్సయ్య, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి వేణుముద్దల శ్రీధర్‌రెడ్డి, పట్టణ ప్రచార కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ మండల శ్రీనివాస్, బీసీ సంఘం అధ్యక్షుడు పుల్లూరి స్వామిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు



నర్సంపేట రూరల్ : సమావేశంలో మాట్లాడుతున్న బాల్నె వెంకన్న

● బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటనారాయణ

నర్సంపేట రూరల్/నల్లబెల్లి/ఖానాపురం/దుగ్గొండి : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్టు మోసపూరితంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ నర్సంపేట మండల ఎన్నికల ఇన్‌చార్జ్ నామాల సత్యనారాయణ, చెన్నారావుపేట మండల అధ్యక్షుడు బాల్నె వెంకన్న తెలిపారు. ఆయా మండలాల్లోని శనివారం నిర్వహించిన సమావేశాల్లో నాయకులు మాట్లాడారు. బీఆర్ఎస్ తప్పుడు విధానాలతోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కడం లేదని బీఆర్ఎస్ నల్లబెల్లి మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్డి సామాజిక వర్గ నేతలతో పరోక్షంగా కేసులు వేయించి ఎన్నికలకు ఆపివేయించిందని ఖానాపురంలో నిర్వహించిన సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు బంధారపు శ్రీనివాస్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ బీసీలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నర్సంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాన్నం మొగిలి దుగ్గొండిలో నిర్వహించిన సమావేశంలో భరోసా ఇచ్చారు. సమావేశాల్లో పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, పార్టీ మండల అధ్యక్షులు వల్లెపు శ్రీనివాస్, సుకినె రాజేశ్వర్‌రావు, నాయకులు కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, కొత్తపల్లి కోటిలింగాచారి, క్యాతం శ్రీనివాస్, అజహర్, ఆబోతు అశోక్, నాయకులు కాట్ల భద్రయ్య, శానబోయిన రాజ్‌కుమార్, రేవూరి సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

2024-డీఎస్సీ టీచర్ల సంబురాలు



నర్సంపేట రూరల్ : 2024-డీఎస్సీ ద్వారా నియమితులైన చెన్నారావుపేట మండలంలోని వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు శనివారం సంబురాలు నిర్వహించారు. ఎంఈఓ బైరి సరళ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు పాపయ్య, ప్రభాకర్‌రావు సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొమ్మెర సతీశ్, జక్కుల అశోక్, అంబటి అక్షయ, వనిత, మహేశ్, రాజు, పరమేశ్వర్, మధు బాబు, శ్వేతశ్రీ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

వర్ధన్నపేట : కేంద్ర ప్రభుత్వం మేరా యువ భారత్ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌కు 15 నుంచి 29 ఏళ్ల వరకు వయస్సులైన క్రీడాకారులు ఈనెల 12, 13వ తేదీల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని బ్లాక్ కోఆర్డినేటర్ నవీన్ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. గ్రూప్ ఈవెంట్లలో భాగంగా పురుషుల కబడ్డీ (ఏడుగురు సభ్యుల జట్టు), మహిళలకు టగ్ ఆఫ్ వార్/తాడు గుంజు ఆట (8 మంది సభ్యుల జట్టు), వ్యక్తిగత ఈవెంట్లుగా పురుషులకు, మహిళలకు 100 మీటర్ల పరుగు పందెం, బ్యాడ్మింటన్ (షటిల్ సింగిల్స్) అంశాల్లో పోటీలుంటాయని పేర్కొన్నారు. వర్ధన్నపేట, రాయపర్తి మండలాల బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన క్రీడాకారులు సెల్ నంబర్ 9502126384, 9505496034లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఎంట్రీ ఫీజు లేదని, క్రీడా పోటీల తేదీలను త్వరలో తెలియజేస్తాయని వివరించారు. విజేతలకు కేంద్ర ప్రభుత్వం ట్రోఫీ, మెడల్, అభినందన పత్రం అందిస్తుందని తెలిపారు. రన్నర్స్‌కు మెడల్, పాల్గొన్న క్రీడాకారులకు పార్టిసిపెంట్ పత్రాలు అందజేస్తారని పేర్కొన్నారు.

స్కూల్‌లో మత ప్రచారం సరికాదు

● బీజేపీ మండల అధ్యక్షుడు కుమారస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

వర్ధన్నపేట : పట్టణంలోని పుస్కోస్ హైస్కూల్‌లో మత ప్రచారం నిర్వహించడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు, కన్వీనర్ రాయపురం కుమారస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి సత్యం అన్నారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. స్కూల్‌కు పాస్టర్ చేరుకుని మత ప్రచారం చేశారని, విద్యార్థుల తల్లిదండ్రులు బహిర్గతం చేయడంతో ఏబీవీపీ నాయకులు ఫిర్యాదు చేయగా అధికారులు నామమాత్రంగా విచారణ చేశారని తెలిపారు. పాఠశాలల్లో మత ప్రచారం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తదుపరి కార్యచరణ తప్పదని స్పష్టం చేశారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు జడ సతీశ్, కుందూరు మహేందర్‌రెడ్డి, పంజా వెంకటేశ్వర్లు, చీపురు వెంకటస్వామి, ఎలిషాల రాకేశ్, గుడ్ల సుభాశ్, పెండోట మహంత్, పోశాల సురేశ్, సిద్ధూ, గిరిప్రసాద్, మణిదీప్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల బిల్లుల పెండింగ్

● మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు తిప్పలు



నల్లబెల్లి స్కూల్‌లో వంట సిద్ధం చేస్తున్న కార్మికులు

నల్లబెల్లి : ప్రభుత్వం కోడిగుడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉంచింది. దీంతో మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులకు తిప్పలు తప్పడం లేదు. వడ్డీపై అప్పు చేసి మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుడ్ల బిల్లులు ఈ ఏడాది జనవరి నుంచి కొన్ని స్కూళ్లకు పెండింగ్‌లో ఉంచగా మరికొన్ని స్కూళ్లకు ఏప్రిల్ వరకు చెల్లించినట్టు తెలుస్తోంది.

జిల్లాలో..

జిల్లాలో మొత్తం 344 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 13725 మంది, 68 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 2861 మంది, 134 హైస్కూళ్లలో 10582 మంది విద్యార్థులు చదువుతుండగా వారికి ప్రతిరోజూ మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు భోజనం అందిస్తున్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం ప్రతినెలా రూ.3 వేల వేతనం చెల్లిస్తోంది. భోజనానికి బిల్లులను తరగతుల వారీగా, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విడుదల చేస్తోంది. ఇందులో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వారానికి మూడు కోడిగుడ్లతోపాటు మెనూ అమలు చేయాలి. డిసెంబర్ నుంచి 8 నెలలకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం చెల్లించలేదని తెలిసింది. మూడు నెలలుగా కార్మికులకు కుకింగ్ చార్జీలు అందించ లేదు. ప్రభుత్వం కేవలం బియ్యం మాత్రమే అందిస్తోందని, మిగతా సరుకులు సమకూర్చడంలో ప్రతినెలా ఆర్థిక భారంతో కార్మికులు సతమతమవుతున్నారు. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు కోరుతున్నారు.

గిట్టుబాటు కావట్లేదు

కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరిగాయి. ప్రభుత్వం బిల్లులు పెంచడం లేదు. ఏడు నెలలుగా కోడిగుడ్ల బిల్లులు, మూడు నెలలుగా గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంది. విద్యార్థులకు భోజనం అందించేందుకు వడ్డీపై అప్పు తేవాల్సి వస్తోంది. బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాలి.

- కోడూరి సుమలత, కార్మికురాలు

బిల్లులు త్వరలో చెల్లిస్తాం

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న కోడిగుడ్ల బిల్లులు, గౌరవ వేతనం త్వరలో చెల్లిస్తాం. సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం. కార్మికులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బిల్లులు విడుదలయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటాం.

- బి.రంగయ్య నాయుడు, డీఈఓ

కేంద్రం తీరుతో బీసీలకు నష్టం

● ఎంసీపీఐ(యూ) కార్యదర్శి రాజా సాహెబ్



రాస్తారోకో చేస్తున్న నాయకులు

దుగ్గొండి : కేంద్ర ప్రభుత్వ తీరుతో బీసీలకు నష్టం వాటిల్లుతోందని ఎంసీపీఐ(యూ) నర్సంపేట డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజా సాహెబ్ అన్నారు. ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని గిర్నిబావిలోని ప్రధాన రహదారిపై శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా సాహెబ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ జీఓ నంబర్ 9 జారీ చేయడం సరైనదేనని చెప్పారు. కాగా కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పిస్తే బీసీలకు చట్టసభల్లో బలం చేకూరేదని తెలిపారు. అందుకు భిన్నంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు రాష్ట్రంలో బీసీలకు అన్యాయం జరిగేలా ఉందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి సింగతి మల్లికార్జున్, సహాయ కార్యదర్శి ఎల్లబోయిన రాజు, డివిజన్ కమిటీ సభ్యులు బుడిమె సురేందర్, బత్తిని కుమారస్వామి, గటిక కోటేశ్వర్, సాయికుమార్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

'సీపీఎంతోనే ప్రజాపోరాటాలు సాధ్యం'

ఐనవోలు : పేద ప్రజల కోసం ప్రజా పోరాటాలు చేయడం సీపీఎంతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొట్ల చక్రపాణి అన్నారు. శనివారం మండలంలోని వనమాల కనపర్తి గ్రామంలో పది కుటుంబాలు సీపీఎంలో చేరగా బొట్ల చక్రపాణి, కాడబోయిన లింగయ్య వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కులాల, మతాల నడుమ చిచ్చు పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీలో చేరిన వారిలో సింగారపు నాగరాజు, సుధాకర్, రాజుందర్, సలీం, రాజు, ఐలయ్య ఉన్నారు. నాయకులు నారాయణ రెడ్డి, ఉప్పలయ్య, యాకూబ్ పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు

● కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న రామచంద్రం

మామునూరు : క్రీడల్లో రాణించిన విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని, క్రీడాకారుల్లో స్నేహభావంతో పాటు క్రమశిక్షణ, పోటీతత్వం పెంపొందుతుందని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామ చంద్రం, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ వై.వెంకటయ్య, వాగ్దేవి కళాశాల డైరెక్టర్లు వాణిదేవి, సీహెచ్.సుదర్శన్‌రెడ్డి, ఇంతేజార్‌గంజ్, మామునూరు సీఐలు సుబ్రు, రమేష్ అన్నారు. శనివారం ఖిలావరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి క్రీడా మైదానంలో కేయూ ఆధ్వర్యంలో వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.సునీల్ రెడ్డి సహకారంతో 11 నుంచి 13 వరకు జరగనున్న యూనివర్సిటీ ఇంటర్ కాలేజీ ఫర్ ఉమెన్స్ 2025–26 టోర్నమెంట్స్ అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా వారు హాజరై క్రీడాపోటీలను ప్రారంభించి మాట్లాడారు. కేయూ పరిధిలోని వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ ఉమ్మడి జిల్లాల నుంచి ఖోఖో, వాలీబాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్ బాల్, చెస్, సాఫ్ట్‌బాల్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, క్రాస్ కంట్రీ తదితర క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ పోలే లక్ష్మిపతి, వివిధ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లు, 1500 మంది మహిళా క్రీడాకారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

ఆత్మకూరు : గడ్డిమందు తాగిన వివాహిత చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని అక్కంపేటలో చోటుచేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన యాదం లక్ష్మి(33) భర్త మద్యానికి బానిసయ్యాడు. పనికి వెళ్లకుండా ఇంటివద్దే ఉంటూ అవమానించడంతో మనోవేదనకు గురైన ఆమె ఈనెల 9న గడ్డిమందు తాగింది. స్థానికులు, భర్త నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి సోదరుడు బండి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

దుకాణాల యజమానులు నిబంధనలు పాటించాలి

ఆత్మకూరు : మండలంలోని దుకాణాలు రాత్రి 10.30 గంటల వరకు మూసివేయాలని స్థానిక సీఐ సంతోశ్ వ్యాపారస్తులకు సూచించారు. మండలంలోని గూడెప్పాడ్ జంక్షన్‌లో శనివారం వివిధ షాపుల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాత్రి 10.30 గంటల వరకు షాపులు తప్పనిసరిగా మూసివేయాలని చెప్పారు. సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి ఆలస్యంగా మూసివేసే దుకాణాల యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.

జాతీయ భావాలు పెంపొందించడమే లక్ష్యం

గూడూరు : మహిళల్లో జాతీయ భావాలు పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అనుబంధ రాష్ట్ర సేవికా సమితి పని చేస్తుందని ఆర్ఎస్ఎస్ ఖమ్మం విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ కవిడి రమేశ్ అన్నారు. మండల కేంద్రంలోని అరవింద విద్యాలయంలో శనివారం రాష్ట్ర సేవికా సమితి గూడూరు శాఖ ఆధ్వర్యంలో విజయదశమి ఉత్సవం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రేరణతో 1936లో వందనీయ లక్ష్మీబాయి కేల్కర్ విజయదశమి రోజు రాష్ట్ర సేవికా సమితిని ప్రారంభిచారని తెలిపారు. ఆ తరువాత దేశ నిర్మాణంలో పురుషులతోపాటు మహిళలకు సమానమైన బరువు బాధ్యతలు ఉన్నాయని గుర్తించారు. హిందూ సమాజం నేడు కులమత కొట్లాటలతో మునిగిపోతున్న తరుణంలో కలిసి ఉంటే కలదు సుఖం అన్న అంశంపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర సేవికా సమితి జిల్లా కార్యవాహిక పింగిళి స్వరూపారాణి, అరవింద విద్యాలయ కరస్పాండెంట్ పింగిళి శ్రీనివాస్, సేవికా సమితి మండల ప్రతినిధులు పాల్గొన్నారు.